



జయం మనదే..

తుని సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

ఓడిపోతామని తెలిసే వైసీపీ దాడులు

- కల్తీకి కేరాఫ్‌గా మారిన మంత్రి
- మట్టి, ఇసుక మాఫియాకు రాజా
- హేచరీకి రూ.10 లక్షల మామూళ్లు
- విలేకరిని హత్య చేయించారు
- రానున్నది కూటమి ప్రభుత్వమే
- జనసంద్రంగా మారిన తుని



ఫ్యాన్ గాలి తీసేయండి : సభలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

తుని రూరల్, మే 5 : కల్తీకి కేరాఫ్‌గా మారిన ఘనత తునికి చెందిన వైసీపీ మంత్రి దాడిశెట్టి రాజాకే దక్కిందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విమర్శించారు. కూటమి ఉమ్మడి అభ్యర్థుల ప్రచారంలో భాగంగా తుని పట్టణం గొల్ల అప్పారావు సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రానున్నది కూటమి ప్రభుత్వమేనని, ఓడిపోతామని తెలిసే వైసీపీ నాయకులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే చర్యలకు మంత్రి దాడిశెట్టి రాజా పాల్పడ్డారని, పత్రికా స్వేచ్ఛను హరించి ఓ పత్రికా విలేకరిని దారుణంగా హత్య చేయించారన్నారు. తాండవ నదిలో యథేచ్ఛగా ఇసుక తవ్వి తరలించి సముద్ర తీరాన సముద్రపు ఇసుకను కలిపి కల్తీ ఇసుకను అమ్ముకుంటున్నారన్నారు. తీర ప్రాంతాల్లో రాష్ట్రానికి ఆదాయ వనరులుగా మారిన హేచరీల నుంచి రూ.10 లక్షలు మామూళ్లు వసూలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో సాగునీటి కాల్వలు గాలికి వదిలేసి రైతులను దెబ్బతీశారని ధ్వజమెత్తారు.తునిలో ప్రధాన సమస్య తాండవ రిటైనింగ్ వాల్ ఊసే లేదని, మట్టి మాఫియా నడిపిస్తూ కోట్ల రూపాయలు దండుకోవడమే మంత్రి పనిగా పెట్టుకున్నారన్నారు. మంత్రి ఇలాకాలోనే రోడ్లు దయనీయంగా మారాయని, మిగతాచోట్ల పరిస్థితి చెప్పనక్కరలేదన్నారు. తునిలో సమస్యలు పరిష్కారం అవ్వాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్న దివీస్ పరిశ్రమ సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని, మత్స్యకారులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. దివీస్ సమస్యపై గతంలో తొండంగి మండలంలో పర్యటించి వారికి అండగా నిలిచినట్టు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కాలుష్య రహిత పరిశ్రమల పనిపడతామన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం అభివృద్ధి చేస్తామన్నారు. పంపా, తాండవ రిజర్వాయర్లకు సంబంధించిన పంట కాల్వలు ఆధునికీకరించి రైతులను ఆదుకుంటామన్నారు. తుని రైల్వేస్టేషన్‌లో లోకల్ ట్రైన్స్ హాల్ట్‌కు చొరవ చూపి ఈ ప్రాంత వాసుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తుని అభ్యర్థి యనమల దివ్య, పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజలకు అన్నివిధాలా అండగా ఉంటామని రానున్న ఎన్నికల్లో సైకిల్, గాజు గ్లాసు గుర్తులపై అమూల్యమైన ఓటును వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి ఇంట సంక్షేమం వెల్లివిరుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుందన్నారు. ముందుగా చామవరం వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి బహిరంగ సభ వేదిక వరకూ రోడ్ నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, తుని అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి యనమల దివ్య పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత, సుర్ల లోవరాజు, ఇనుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, మోతుకూరి వెంకటేష్, యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధు వీరేష్, చోడిశెట్టి గణేష్, బీజేపీ నేత చిలుకూరి రామ్‌కుమార్ పాల్గొన్నారు.



వీరికే ఓటేయండి : కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్, తుని ఎమ్మెల్యే అభ్యర్థి యనమల దివ్య, పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనితను పరిచయం చేస్తున్న పవన్



పవన్‌ను కలిసిన ముద్రగడ కుమార్తె

తుని రూరల్ : తునిలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి, చందు దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పవన్‌కల్యాణ్‌పై ముద్రగడ పద్మనాభం చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ జనసేనానికి మద్దతుగా మాట్లాడిన విషయం విదితమే. దీంతో వీరి కలయిక చర్చనీయాంశమైంది.



పవర్ స్టార్.. ప్రభంజనం : తునిలో జరిగిన పవన్ సభకు హాజరైన యువత



నేడు ప్రధాని మోదీ రాక

- రాజమహేంద్రవరం వేమగిరిలో కూటమి భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న పవన్, పురందేశ్వరి, లోకేశ్
- వేదిక, ఇతర ఏర్పాట్లు పూర్తి
- భారీ భద్రతా ఏర్పాట్లు



వేమగిరిలో మోదీ పాల్గొనే సభా వేదిక ఏర్పాట్లు


రాజమహేంద్రవరం, మే5(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం రాజమహేంద్రవరం రానున్నారు. ఎన్‌డీఏ కూటమి భాగస్వాములుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితోపాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ హాజరుకానున్నారు. 'విజయశంఖారావం' పేరుతో నిర్వహించే ఈ సభ 60 ఎకరాల్లో ఏర్పాటుచేశారు. విశాలమైన సభావేదికలు ఏర్పాటు చేశారు. హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపం వరకూ హైవేకు రెండువైపులా బారికేడ్లు ఏర్పాటుచేశారు. వేమగిరి వైపు కూడా బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. అడిషనల్ డీజీ అతుల్‌సింగ్ ఆధ్వర్యంలో పోలీసు భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తం ఈ ప్రాంతాన్ని ఎస్‌పీజీ స్వాధీనం చేసుకుంది. ప్రాంగణంలో 50 వేల మంది కూర్చోవడానికి కుర్చీలు వేస్తున్నారు. ప్రధానమంత్రి పాల్గొనే ఈ విజయశంఖారావం సభ వేదికపై మొత్తం 44 మంది ఆశీనులయ్యేటట్టు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానమంత్రి మోదీ, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితోపాటు కాకినాడ, అమలాపురం, నర్సాపురం, ఏలూరు పార్లమెంటు అభ్యర్థులకు కూడా స్థానం కల్పించనున్నారు. వారితోపాటు ముఖ్యంగా రాజమండ్రి పార్లమెంట్ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులకు చోటు కల్పించనున్నారు. ఇంకా టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన ముఖ్య నేతలకు కూడా అవకాశం కల్పిస్తారు.

ప్రధాని రాక ఇలా..

ప్రధాని నరేంద్రమోదీ సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట 35 నిమిషాలకు ఛత్తీస్‌గడ్‌లోని జగ్దల్‌పూర్ ఎయిర్‌పోర్టు నుంచి ఐఏఎఫ్ ఎంబ్రేయర్ మీద బయలుదేరి 2.25 గంటలకు రాజమండ్రి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2.30 గంటలకు ఎం.ఐ 17 హెలికాప్టర్ మీద 2.50 గంటలకు వేమగిరిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు వస్తారు. అక్కడ నుంచి 2.55 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 3 గంటలకు సభావేదిక వద్దకు వస్తారు. అక్కడ 3 గంటల నుంచి 3.45 గంటల వరకూ అంటే మొత్తం 45 నిమిషాలపాటు వేదిక మీద ఉంటారు. 3.45కు బయలుదేరి రోడ్డు మార్గాన 3.55 గంటలకు హెలిపాడ్‌కు చేరుకుంటారు. హెలికాప్టర్‌లో అనకాపల్లి వెళతారు.

గాలి వీస్తోంది!

కూటమి వైపే 'గోదారి' పవనాలు



- అధినేతల చూపంతా ఇక్కడే
- గోదావరి జిల్లాలను జల్లెడ పడుతున్న పార్టీలు
- రోజూ ఏదొక అధినేత ఈ జిల్లాల్లోనే పర్యటన
- టీడీపీ అధినేత చంద్రబాబు సుడిగాలి పర్యటనలు.. దూకుడు పెంచేలా వ్యూహాలు
- జనసేన అధినేత సైతం ఉమ్మడి జిల్లాపైనే దృష్టి
- అన్ని నియోజకవర్గాలనూ చుట్టేస్తున్న పవన్
- పిఠాపురంలో బరిలోనూ 'వారాహి' స్పీడు
- రాజమండ్రి ఎంపీ బరి నుంచి పురందేశ్వరి
- రాష్ట్ర అధ్యక్షురాలిగానూ దిశానిర్దేశం
- కూటమి అభ్యర్థుల జోరుతో వైసీపీ డీలా
- ఇప్పటికే జగన్ పర్యటించినా కలసిరాని వైనం
- మోదీ సభతో ఇక 'విజయశంఖారావమే'

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు అనూహ్యమైన తీర్పు ఇవ్వబోతున్నట్టు గోదావరి తీరంలోని జనంనాడి చెబుతోంది. ఉభయగోదావరి జిల్లాల్లో ఈసారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వైపు గాలి వీస్తుండడంతో ఆయా పార్టీల్లో జోష్ పెరిగింది. 2019లో ఇక్కడ వైసీపీ ఫ్యాన్ గాలితో దూసుకెళ్లింది. ఈసారి గోదావరిలో సహజమైన గాలి వీస్తోంది. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత అస్తవ్యస్థ విధానాలు, అవినీతి, అరాచకం, శాంతిభద్రతలు మృగ్యంకావడం, వేధింపు ధోరణులు, ప్రకృతి వనరుల దోపిడీ.. అభివృద్ధి లేకపోవడం, నిరుద్యోగం.. ఇలా సవాలక్ష సమస్యల్లో జనం చిక్కుకుపోయారు. అసలు పథకాలన్నీ మూలనపడేసి, కొన్ని సంక్షేమాల పథకాల పేరిట బటన్ నొక్కినా, అవి ప్రజలకు ఎప్పుడు చేరతాయో కూడా తెలియని గందరగోళం మధ్య ఐదేళ్లు గడిచింది. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి.. సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం కూడా దుర్భరమైన స్థితిని చవిచూశారు. కరెంటు చార్జీలు, పన్నుల పేరిట సాగించిన ప్రభుత్వం అన్ని వర్గాలపై ఎనలేని భారం మోపింది. నరకప్రాయమైన రోడ్లు, అభివృద్ధి లేమితో ప్రజలు పడినపాట్లు అన్నీఇన్నీ కావు. ఈ నేపథ్యంలో అభివృద్ధి అనేది ఎక్కడా ప్రచారం చేసుకోలేని దుస్థితిలో వైసీపీ ఉంది. ఈసారి సంక్షేమం అనే ఒక్క మాటనే పదేపదే వల్లెవేస్తూ జగన్ బటన్ నొక్కిన కార్యక్రమాన్ని ప్రచారం చేస్తోంది. మరోవైపు ఆ పార్టీ మేనిఫెస్టో కూడా తుస్సుమనడంతో కేడర్ మరింత డీలా పడింది. ఇటు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమికి గోదావరి జిల్లాల్లో జనం బ్రహ్మరథం పడుతుండడం వైసీపీ నేతల్లో వణుకుపుట్టిస్తోంది. శాంతిభద్రతలు కాపాడడంతోపాటు సంక్షేమ, అభివృద్ధి పథకాలతో కూడిన ప్రజామేనిఫెస్టోను కూటమి విడుదల చేయడంతో మంచి స్పందన వచ్చింది. మరోవైపు టీడీపీకి కంచుకోటలాంటి గోదావరి జిల్లాల్లో టీడీపీ అధినేత చంద్రబాబు మొదటి నుంచి ప్రత్యేక దృష్టి పెట్టారు. వైసీపీ కుట్ర వల్ల చంద్రబాబు 53 రోజులపాటు రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా మగ్గిపోయిన సమయంలో ఆయన కుటుంబ సభ్యులంతా రాజమహేంద్రవరంలోనే మకాం ఉండి ప్రజలతో కలసి ఉండిపోయారు. చంద్రబాబుకు ప్రపంచవ్యాప్తంగా మద్దతు లభించడంతోపాటు ఆయన గొప్పతనం ప్రజలకు బాగా అర్థమైంది. అంతకుముందే గత ఏడాది మే నెలలో రాష్ట్ర స్థాయి టీడీపీ మహానాడును ఇక్కడే నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలనూ ఇక్కడి నుంచే ప్రకటించారు. మహానాడు కూడా గోదావరి జిల్లాల్లో మరింత జోష్‌ను పెంచింది. టీడీపీ-జనసేన పొత్తు కూడా రాజమహేంద్రవరంలోనే పొడవడం, నేరుగా పవన్‌కల్యాణ్ ఇక్కడి నుంచే ప్రకటించడమేగాకుండా తొలి భేటీ కూడా ఇక్కడే నిర్వహించడం రాజకీయ సంచలనాలకు దారితీసిందనే చెప్పాలి. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు తర్వాత టీడీపీ అధినేత చంద్రబాబు గోదావరి జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఎన్నికల ప్రకటన తర్వాత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రధానంగా గోదావరి జిల్లాలపైనే దృష్టి పెట్టారు. గోదావరి జిల్లాల్లో గాలి ఎటుంటే అదే పార్టీ అధికారంలోకి వస్తుందనేది ఎన్నోసార్లు రుజువైంది. దీంతో గోదావరి జిల్లాల్లో గెలుపే ప్రధానంగా ఇటు కూటమి, అటు వైసీపీ కూడా సర్వశక్తులూ ఒడ్డి పోరాడుతున్నాయి. ప్రతిరోజూ ఏదొక అధినేత గోదావరి జిల్లాల్లో పర్యటిస్తుండడమే దీనికి ఉదాహరణ. సీట్ల కేటాయింపులో టీడీపీ, జనసేన మధ్య కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడినా.. ఊహించని విధంగా ఇప్పుడు క్షేత్రస్థాయిలో ఈ రెండు పార్టీల కేడర్లు ఎంతో పట్టుదలగా కలసి పనిచేస్తున్నాయి. గత ఎన్నికల్లో జనసేన కూడా గోదావరి జిల్లాల్లో గణనీయమైన ఓటుబ్యాంకును సాధించుకోవడంతో ఇప్పుడు కూటమికి మరింత బలం చేకూరిందని టీడీపీ, జనసేన అభ్యర్థులు గణాంకాలతో సహా చెబుతున్నారు. మరో రెండు ఆసక్తికరమైన అంశాలు ఏమంటే.. రెండు ప్రధాన పార్టీలైన బీజేపీ, జనసేన అధినేతలు పురందేశ్వరి, పవన్‌కల్యాణ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచే పోటీ చేస్తుండడం ఈ ప్రాంతంలో ప్రభావితం చూపుతుందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా పిఠాపురం నుంచి పోటీచేస్తున్న పవన్‌కల్యాణ్ తన నియోజకవర్గంతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరిని ప్రభావితం చేసేలా పూర్తిస్థాయిలో తన పర్యటనలను రూపొందించుకోవడం వ్యూహాత్మకమే. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్.. గోదావరి జిల్లాల ఫలితాలను పూర్తి స్థాయిలో ప్రభావితం చేసేలా ఎన్నికల ప్రచారాలను సాగిస్తున్నారని ఆ పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు. రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి విజయావకాశాలపైనా అందరి దృష్టి ఉంది. ఆమె తన పరిధిలోని ఏడు నియోజకవర్గాల కూటమి అభ్యర్థులతో కలసి పెద్దఎత్తున ప్రచారం సాగిస్తూ విజయానికి చేరువవుతున్నారు. అదే సమయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగానూ ఇక్కడి నుంచే దిశానిర్దేశం చేస్తున్నారు. ఎన్నడూ లేనివిధంగా రాజకీయ ఉద్ధండులంతా గోదావరి జిల్లాలపై పూర్తిగా దృష్టి పెట్టడం ఆసక్తికరంగా మారింది. వైసీపీ అధినేత జగన్ కూడా ఎక్కువసార్లు గోదావరి జిల్లాల్లో పర్యటించే విధంగానే తన రూటు మ్యాప్‌ను రూపొందించుకుంటున్నారు. బస్సు యాత్ర ద్వారా, తర్వాత అంబాజీపేటలో ఎన్నికల ప్రచారానికి ఇప్పటిదాకా రాగా, ఆయా జగన్ సభలు అనుకున్నవిధంగా విజయవంతంకాకపోవడంతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఈ నెల 7న కోరుకొండలో ఎన్నికల ప్రచారసభ కోసం మరోసారి జగన్ రాబోతున్నారు. మొత్తానికి వైసీపీ గోదావరి జిల్లాల్లో ఈసారి వ్యతిరేక పవనాలు వీస్తుండడం వైసీపీ అభ్యర్థులను కలవరానికి గురిచేస్తోంది. ఎన్‌డీఏ కూటమి తరఫున ప్రచారానికి సోమవారం రాజహేంద్రవరం వస్తున్న ప్రధాని మోదీ విజయశంఖారావం పూరించి.. దూకుడు పెంచనున్నారు.

రేపు కోరుకొండలో సీఎం జగన్ పర్యటన

5

హీరో సాయిధరమ్ తేజ్‌పై పిఠాపురంలో దాడి

- మెయిన్‌లో..



అభ్యర్థితో.. ఒకరోజు

సామర్లకోట మండలం అచ్చంపేటలో టీడీపీ నేతలతో సమావేశమైన చినరాజప్ప

ప్రచారం.. వ్యూహరచనలు



పెద్దాపురం కూటమి అభ్యర్థి చినరాజప్ప

రోజుకు 24 గంటలు కాదు.. 48 గంటలైనా సరిపోదేమో.. ఎన్నికల సమయం దగ్గరపడడంతో అభ్యర్థులు అంత బిజీబిజీగా ఉంటున్నారు. ఎన్నికల వేళ అసలు అభ్యర్థులేం చేస్తారు.. వారి షెడ్యూల్ ఎలా ఉంటుందనే దానిపై అందరికీ ఆసక్తే.. దీనిలో భాగంగానే పెద్దాపురం కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్పతో ఆదివారం ఆంధ్రజ్యోతి అభ్యర్థితో ఒకరోజు నిర్వహించగా.. ఉదయం నుం చి సాయంత్రం వరకూ ఊపిరిసలపనంత బిజీబిజీగా గడిపారు.. ఉదయం 5.30 గంటలకు నిద్ర లేచిన ఆయన 40నిమిషాలపాటు వాకింగ్ చేశారు.. ఆ తరువాత అల్పాహారం స్వీకరించి సిద్ధమై బయటకు వచ్చారు.. వివిధ గ్రామాలనుంచి వచ్చిన పలువురిని పలకరించారు. ఉదయం 10గంటలకు పెద్దాపురం క్యాంపు కార్యాలయానికి వెళ్లగా పార్టీలో చేరిన వారిని ఆహ్వానించారు. తర్వాత ప్రార్థనామందిరాలను సందర్శించారు. కాకినాడలో వెలమ ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. తర్వాత అచ్చంపేటలో టీడీపీ నేతలతో భేటీ అయ్యారు. - వివరాలు 5వ పేజీలో

ఓటనే వజ్రాయుధంతో అరాచక పాలనకు ముగింపు పలకాలి

- రాష్ట్రాభివృద్ధికి కూటమికి అధికారం అప్పగించాలి
- కాకినాడ రూరల్ అసెంబ్లీ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి పంతం నానాజీ



కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పంతం నానాజీ

సర్పవరం జంక్షన్/కాకినాడ రూరల్, మే 5: ఐదేళ్ల సీఎం జగన్ అరాచక పాలనకు ఓటనే వజ్రాయుధంతో ముగింపు పలకాలని, రాష్ట్రాభివృద్ధి కోసం కూటమికి అధికారం అప్పగించాలని కాకినాడ రూరల్ అసెంబ్లీ జనసేన, టీడీపీ, బీజేపీ అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రేపూరు, కొవ్వాడ, గంగనాపల్లి, తిమ్మాపురం అవంతినగర్‌లో ఆదివారం రోడ్డుషో, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పలువురు కార్యకర్తలు, నాయకులు తమ అభిమానాన్ని చాటుతూ నానాజీని గజమాలతో సత్కరించారు. ఇంటింటికీ ప్రచార కార్యక్రమంలో మహిళలు హారతులుపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల ఎమ్మెల్యే కన్నబాబు పాలనలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. యువతకు పరిశ్రమల్లో ఉపాధి, ఉద్యోగాలు కల్పించకుండా చేశారని విమర్శించారు. ఉమ్మడి మేనిఫెస్టోపై ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. ఈనెల 13న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయం చారిత్రక అవసరమన్నారు. ఒక్క ఛాన్సంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌కు మరోసారి అవకాశం ఇస్తే ప్రజలే నష్టపోతారన్నారు. చంద్రబాబు, పవన్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం చారిత్రక అవసరమన్నారు. గాజుగ్లాసు గుర్తుపై ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా ఉదయ్ శ్రీనివాస్‌కు ఓట్లువేసి గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు పెంకేశ్రీనివాసబాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, మాదారపు తాతాజీ, శిరంగు శ్రీనివాసరావు, కోటిపల్లి శ్రీను, రెడ్డిపల్లికిషోర్, పెండెంకృష్ణ, నక్కా శ్రీను, రంబాలవెంకటేశ్వరరావు, పాండ్రంకి రాజు పాల్గొన్నారు.

'ప్రజల భవిష్యత్తు కూటమితోనే సాధ్యం'

కరప, మే 5: రాష్ట్రాభివృద్ధి, ప్రజా శ్రేయస్సు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతులు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కరపమండలం నడకుదురులో కాకినాడ రూరల్ అసెంబ్లీ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు(నానాజీ), ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లకు మద్దతుగా నానాజీ కుమారుడు పంతం సందీప్‌తో కలిసి ఇంటింటా ఎన్నికలప్రచారం నిర్వహించారు.



కరప మండలం నడకుదురులో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి దంపతులు, పంతం నానాజీ కుమారుడు సందీప్



కాకినాడ రూరల్ మండలం రేపూరులో పంతం నానాజీకి హారతులిస్తున్న మహిళలు

జన కేతనం
ఆంధ్రజ్యోతి
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా
సోమవారం 6 మే 2024 4

మహిళలపై నేరాల నియంత్రణకు

ప్రత్యేకంగా రాజమండ్రి రక్షాదళం

డిక్లరేషన్ ఆవిష్కరించిన పురందేశ్వరి, ఆదిరెడ్డి వాసు



డిక్లరేషన్ ఆవిష్కరిస్తున్న పురందేశ్వరి, వాసు, నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, మే 5: మహిళలపై నేరాల నియంత్రణకు సంబంధించి మేనిఫెస్టోలో ప్రత్యేకంగా రూపొందించిన రాజమండ్రి రక్షాదళం డిక్లరేషన్‌ను బీజేపీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, తెలుగుదేశం పార్టీ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు ఆవిష్కరించారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో ఈ మేరకు డిక్లరేషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ మహిళల రక్షణ తమ బాధ్యత అని అన్నారు. వైసీపీ పాలనలో మహిళలపై అత్యాచారాలు, దాడులు ఎక్కువయ్యాయని చెప్పారు. రాజమహేంద్రవరం సిటీలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను పెంచి పోషిస్తున్నది ఎవరో అందరికీ తెలుసని అన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంటున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పాలన మారితేనే అరాచకాలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు. ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, నేరాల నియంత్రణలో భాగంగా దశలవారీగా సిటీలో 7,500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎక్కువగా నేరాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేకంగా రాజమండ్రి రక్షాదళం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు ఆదిరెడ్డి అప్పారావు, సోము వీర్రాజు, టీడీపీ నాయకులు కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణి, జనసేన నాయకుడు అనుశ్రీ సత్యనారాయణ, బీజేపీ నగర ఇన్‌చార్జి యెనుముల రంగబాబు, రేలంగి శ్రీదేవి, మాజీ బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, బొమ్ముల దత్తు, అడబాల రామకృష్ణ, వీరన్న చౌదరి, ఇతర నాయకులు పాల్గొన్నారు. పురందేశ్వరి, ఆదిరెడ్డి వాసు రాజమహేంద్రవరం సిటీలోని రాజస్థానీలు, గుజరాతీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారితో ప్రత్యేకంగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



ఇంద్రభవనాన్ని తలపిస్తున్న వైసీపీ కార్యాలయం





స్థలాలు చూపకపోవడంతో గుడారాల్లోనే పేదల నివాసం

వైసీపీ కోసం

ఇంద్రభవనం

జనాలకు మాత్రం జగనన్న గుడారాలు

రాజమహేంద్రవరంలో వైసీపీ కార్యాలయం రాజ భవనమే..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి):

పై ఫొటోలో మీరు చూస్తోంది మహారాజుల ప్యాలెస్ కాదు. వైసీపీ పార్టీ కార్యాలయం. రెండో ఫొటోలో చూస్తోంది ఎడారిలో డేరాలు కాదు.. సిటీలో పేదల గుడారాలు. వైసీపీ పాలనలో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయిందనడానికి ఇవే ప్రత్యక్ష సాక్ష్యాలు. జగనన్న కాలనీల పేరిట పేదవర్గాల్లో ఎన్నో ఆశలు పుట్టించారు. ఎందుకూ పనికిరాని భూముల్లోను, నివాస ప్రాంతాలకు కిలోమీటర్ల దూరంలోనూ కొందరికి స్థలాలిచ్చారు. ఈ ఐదేళ్లలో ఆ భూముల్లో పేదల ఇళ్లకు పునాదులు కూడా పడలేదు. కానీ చాలామందికి పట్టాలు తప్ప స్థలం కేటాయించిందీ లేదు. పేదల ఇళ్ల కోసం స్థలాల సేకరణ అంటూ వందల కోట్ల రూపాయలు మాత్రం వైసీపీ నాయకులు జేబులో వేసుకున్నారు. ఇక అసలు విషయానికొస్తే.. ఇటీవల ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందు తూర్పుగోదావరిలోని రాజమండ్రి అర్బన్, రూరల్‌లోని పేదలకు రాజానగరం నియోజకవర్గంలోని పలు మండలాల్లో స్థలాలను కేటాయించామంటూ వైసీపీ నాయకులు ఆర్భాటంగా పట్టాలు పంపిణీ చేశారు. అయితే చేతిలో పట్టా పెట్టారేగానీ ఈరోజుకీ స్థలాలు చూపించలేదు. దీంతో పేదలు గుడారాల్లోనే మగ్గిపోతున్నారు. స్థానిక క్వారీ మార్కెట్ ఏరియాలోని పేదలకు రెండు నెలల కిందట ఇళ్ల పట్టాలు ఇచ్చారు. కానీ వారికి ఈనాటికీ స్థలాలు చూపించలేదు. వాళ్లకు ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత కూడా లేకపోవడంతో ఖాళీ స్థలాల్లోకి వెళ్లినా మళ్లీ గుడారాల బతుకులేనంటూ ఆ పేదలు వాపోతున్నారు.

- ఐదేళ్ల నుంచీ పేదలకు గూడు కల్పించలేని వైసీపీ పాలకులు తమ పార్టీ కార్యాలయాలకు మాత్రం ఇంద్రభవనాలు నిర్మించుకుంటున్నారు. పేదలకు ఇళ్ల తర్వాత సంగతి.. ప్రతి జిల్లాకు ఇంద్రభవనంలా పార్టీ కార్యాలయం నిర్మించాలనే జగన్ ఆలోచనతో తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని వైసీపీ.. తమ పార్టీ కార్యాలయ నిర్మాణాన్ని రూ.2 కోట్ల అంచనా వ్యయంతో కేవలం మూడు నెలల కిందట ప్రారంభించారు. సుమారు రెండు ఎకరాల ఆర్అండ్‌బీ స్థలంలో శరవేగంగా 90 శాతం పనులు పూర్తిచేశారు. ఈ స్థలం రాజమహేంద్రవరంలో అత్యంత ఖరీదైన ప్రాంతమైన ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, ఆర్ట్స్ కళాశాల చెంతన ఉంది. ఇక్కడ బహిరంగ మార్కెట్లో గజం లక్షపైనే ఉంది.. ఎకరం రూ.50 కోట్ల దాకా ఉంటుంది. అంటే రూ.100 కోట్లు ఉంటుంది. నామమాత్ర లీజు ప్రాతిపదికన కేబినెట్‌లో ఆమోదం పొంది ఈ నిర్మాణం చేస్తున్నారు. పక్కనే ఆర్ట్స్ కాలేజీలో హెలిప్యాడ్ కూడా అందుబాటులో ఉండేలా ఈ భవన నిర్మాణ స్థలాన్ని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఐదేళ్లలో పేదల సొంతింటి కల తీర్చడం చేతగాని జగన్.. పార్టీకి మాత్రం కోట్లు ఖర్చుపెట్టి ప్యాలెస్‌ని కట్టుకున్నారంటూ జనం నివ్వెరపోతున్నారు.



నేమ్ బోర్డు బహూకరణ

ఆయన పేరు దాట్ల బాబు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కూటమి అభ్యర్థులకు ముందస్తుగానే ఎంపీ, ఎమ్మెల్యే నేమ్ బోర్డులను అందజేశారు. అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌కు ఎంపీ నేమ్‌బోర్డు, ఎమ్మెల్యే అభ్యర్థులు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్, దాట్ల సుబ్బరాజు, వాసంశెట్టి సుభాష్‌లకు ఎమ్మెల్యే నేమ్ బోర్డులు అందజేశారు. వారంతా గెలవడం ఖాయమని తన నమ్మకమని ఆయన చెబుతున్నారు.

– అమలాపురం టౌన్



జానీ మాస్టర్ ప్రచారం

అంబాజీపేట, మే 5: ప్రజలకు సుపరిపాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రముఖ సినీ డ్యాన్స్ మాస్టర్ జానీ మాస్టర్ అన్నారు. పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ఎన్నికల ప్రచారంలో స్టార్ క్యాంపెయినర్‌గా ఆయన పాల్గొని గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. జానీ మాస్టర్‌తో ఫొటోలు తీసుకునేందుకు కూటమి శ్రేణులు ఉత్సాహం కనబరిచారు.

ఓటర్లలో వారిదే పైచేయి..పోటీలో మాత్రం వెనుకంజ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇదీ పరిస్థితి

ఏడు అసెంబ్లీ స్థానాలకు బరిలో ఎనిమిది మందే మహిళలు

అమలాపురం రూరల్, మే 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 13,181 మంది ఎక్కువ ఉన్నారు. అయితే అమలాపురం లోక్‌సభ స్థానంతో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేసేది కేవలం ఎనిమిది మంది మహిళలు మాత్రమే. అమలాపురం అమలాపురం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 15,31,410 మంది ఓటర్లు ఉండగా మహిళలు 7,72,285 మంది, పురుషులు 7,59,104 మంది ఉన్నారు. ఈ స్థానంలో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ఒక్క మహిళా అభ్యర్థి కూడా లేకపోవడం విశేషం. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ తరఫున బూసిం రమణమ్మ నామినేషన్ దాఖలు చేసినప్పటికీ చివరి రోజు ఆమె ఉపసంహరించుకున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 91 మంది అభ్యర్థులు బరిలో ఉండగా ఎనిమిది మంది పోటీలో ఉన్నారు. మండపేట, పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల నుంచి ఒక్క మహిళా అభ్యర్థి కూడా పోటీలో లేరు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి అయితాబత్తుల సుభాషిణి (కాంగ్రెస్), బొజ్జా ఐశ్వర్య (లిబరేషన్ కాంగ్రెస్), రామచంద్రపురం నుంచి 13 మంది బరిలో ఉండగా చెక్కా సుజాత (స్వతంత్ర), ముమ్మిడివరం నుంచి 15 మంది పోటీలో ఉండగా ఆర్.మహాలక్ష్మి (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), అంగాడి రేవతి (స్వతంత్ర), కొత్తపేట నుంచి 13 మంది బరిలో ఉండగా సుంకర లక్ష్మీమణికుమారి (స్వతంత్ర) రాజోలు నుంచి 10 మంది పోటీలో ఉండగా పులపకూర లిలి నీఆశారాణి (బీఎస్పీ), పోతుమూడి అలివేలుమంగతాయారు (స్వతంత్ర) పోటీలో ఉన్నారు. ఓటర్లుగా ముందున్న మహిళలు అభ్యర్థులుగా పోటీ చేయడంలో వెనుకబడిపోయారు. అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మొత్తం ఉన్న మహిళలు 7,72,285 మంది అయినప్పటికీ వారి ప్రాతినిథ్యం పెద్దగా లేకపోవడం చర్చనీయాంశమైంది.

పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు తాయిలాలు





సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రకరకాల తాయిలాలు అందిస్తున్నారు. కుల సంఘాల సమావేశాలు నిర్వహిస్తూ పసందైన భోజనాలు పెడుతూ చిరు కానుకలు అందిస్తున్నారు. ఇదిలా ఉండగా అధికార పార్టీ పోస్టల్ బ్యాలెట్లపై దృష్టిపెట్టింది. కొత్తపేట అసెంబ్లీ పరిధిలో 1,993 పోస్టల్ బ్యాలెట్‌లు ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన వారు తమ అభ్యర్థికే ఓటేయాలంటూ 25 గ్రాములతో తయారు చేయించిన సిల్వర్ కాయిన్లను పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు కానుకగా అందించినట్టు సమాచారం.

– ఆత్రేయపురం



బూట్ పాలిష్ చేసిన నల్లమిల్లి

అనపర్తి, మే 5: అనపర్తి ప్రచారంలో పాల్గొన్న ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్థానిక మెయిన్ రోడ్డులో చెప్పుల దుకాణంలోకి వెళ్లి బూట్ పాలిష్ చేశారు. ఈ ఫొటో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది.



ఎస్‌బీపీ పట్టాభిరామారావు | సంగిత వెంకటరెడ్డి | బి.కమలాదేవి | వల్లూరి నారాయణరావు | వీవీఎస్ఎస్ చౌదరి | బిక్కిన కృష్ణార్జునచౌదరి | వేగుళ్ల జోగేశ్వరరావు

నియోజకవర్గ మార్పులు కచ్చితమైన తీర్పులు

విలక్షణం..విభిన్నం.. మండపేట నియోజకవర్గం



● (మండపేట)

రాష్ట్రంలోనే ఆర్థిక, సామాజిక అంశాల ప్రభావం అధికంగా ఉండే పారిశ్రామిక వాడ లాంటి ప్రాంతం మండపేట. వ్యవసాయం, వ్యాపారం కలగలిసిన విభిన్న నియోజకవర్గం. రైస్‌మిల్లులు అదనపు ప్రత్యేకత. ఎందుకంటే రాష్ట్రంలోనే అత్యధిక రైస్ మిల్లులు ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఆంధ్రా శబరిమలైగా పేరుగాంచిన ద్వారపూడి ఇక్కడే ఉంది..



మండపేటలో రైస్‌మిల్లులు, కోళ్ల పరిశ్రమలతో పాటు, ఆయిల్ పరిశ్రమలు పేపరు మిల్లులు ఉన్నాయి. ఇక్కడ పరిశ్రమల ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా రైస్ మిల్లుల పరిశ్రమలు ఉన్న ప్రాంతం మండపేట, ద్వారపూడి.. అలాగే కేశవరంలో కోకోకోలా ఫ్యాక్టరీ ఉంది. పాడి పంటలకు, కోళ్ల ఫారాలకు మండపేట నెలవు. పశు పోషణలో కూడా పేరుగాంచింది ఈ ప్రాంతం. ఆంధ్రా హరియాణాగా మండపేటకు పేరుంది. ద్వారపూడిలో వస్త్ర వ్యాపారం ప్రముఖమైనది. ప్రఖ్యాతగాంచిన అయ్యప్ప ఆలయం ఇక్కడే ఉంది.

పామర్రు..ఆలమూరు..మండపేట

పూర్వం పామర్రు నియోజకవర్గం నుంచి ఆలమూరుగా ఆలమూరు నుంచి మండపేట నియోజకవర్గంగా రూపాంతరం చెందింది ఈ నియోజకవర్గం. 1978లో ఆలమూరుగా, 2009లో మండపేట నియోజకవర్గంగా ఏర్పడింది. 1952 నుంచి ఇప్పటివరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఏడు సార్లు కాంగ్రెస్, ఆరుసార్లు టీడీపీ, ఒకసారి స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. కపిలేశ్వరపురం జమిందార్ ఎస్‌బీబీపీపీ పట్టాభి రామారావు(కాంగ్రెస్) 1952, 1955, 1962లో జరిగిన ఎన్నికల్లో వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించారు. అనంతరం సంగిత వెంకటరెడ్డి (కాంగ్రెస్) మూడు సార్లు విజయం సాధించారు. అలాగే వల్లూరి నారాయణరావు(టీడీపీ), వీవీఎస్ఎస్ చౌదరి (టీడీపీ) రెండేసి సార్లు, వేగుళ్ల జోగేశ్వరరావు వరుసగా మండపేట నుంచి టీడీపీ తరఫున మూడు సార్లు విజయం సాధించారు. బి.కమలాదేవి (కాంగ్రెస్), బిక్కిన కృష్ణార్జునచౌదరి (కాంగ్రెస్) నుంచి ఒక్కో దఫా గెలుపొందారు.



మండపేటలో మొత్తం 223 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ 91 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,17,647 మంది ఉన్నారు. వారిలో పురుషులు, 1,05,949 మంది మహిళలు 1,11,692 మంది ఉన్నారు. ఇతరులు నలుగురు ఉన్నారు.

జిల్లా నుంచి తొలి మంత్రి..

జిల్లా నుంచి తొలి మంత్రిగా కేబినెట్‌లో చోటు దక్కించుకున్న ఘనత కపిలేశ్వరపురం జమిందార్‌గా పిలువబడే ఎస్‌బీబీపీపీ పట్టాభిరామారావుకు దక్కింది. 1952,1955, 1962లో ప్రకాశం పంతులు, నీలం సంజీవరెడ్డి. దామోదరం సంజీవయ్య మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశారు. అయితే జమిందార్ కుటుంబాన్ని ఓడించిన ఘనత సంగిత వెంకటరెడ్డి(చిన్నకాపు)కే దక్కుతుంది. వెంకటరెడ్డి రాష్ట్ర మంత్రిగా 1978, 1981, 1989, 1991, 1993 సంవత్సరాలలో ఆలమూరు నియోజకవర్గం నుంచి మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్య, నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో వివిధ శాఖలను నిర్వర్తించారు.

టీడీపీకి కంచుకోటగా..

2009లో నియోజకవర్గ పునర్విభజన జరిగింది. మండపేట అర్బన్, మండపేట రూరల్, కపిలేశ్వరపురం మండలం, రాయవరం మండలాలతో మండపేట నియోజకవర్గం ఆవిర్భవించింది. అప్పటినుంచి ఇక్కడ జరిగిన మూడు ఎన్నికల్లో కూడా టీడీపీ తరఫున పోటీ చేసిన వేగుళ్ల జోగేశ్వరరావు వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించారు. ఆయన నాలుగో సారి మండపేట నుంచి బరిలో నిలిచి వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుతో తలపడుతున్నారు. తొలిసారి 2009లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన వేగుళ్ల జోగేశ్వరరావు సమీప ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి వీవీఎస్ఎస్ చౌదరిపై 17,440 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. 2014లో టీడీపీ తరఫున రెండోసారి బరిలో నిలిచిన వేగుళ్ల తన సమీప వైసీపీ అభ్యర్థి గిరిజాల స్వామినాయుడుపై 36,014 ఓట్లతో విజయం సాధించారు. మూడోసారి 2019లో టీడీపీ తరఫున బరిలో నిలిచిన వేగుళ్ల సమీప వైసీపీ అభ్యర్థి పిల్లి సుభాష్‌చంద్రబోస్‌పై 10,600 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే వేగుళ్ల ఐదోసారి టీడీపీ తరఫున బరిలోకి దిగి సమీప వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుపై పోటీ చేస్తున్నారు.



పామర్రు రాజకీయ చరితం

1952లో పామర్రు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎస్‌బీబీపీ పట్టాభిరామారావు గెలుపొందారు. తొలి ఎమ్మెల్యేగా జమిందార్ సేవలందించారు. 1955లో జరిగిన ఎన్నికల్లో పట్టాభిరామారావు రెండోసారి విజయం సాధించారు. 1962లో పోటీ చేసిన పట్టాభిరామారావు స్వతంత్ర అభ్యరి ఎం.వీరన్నపై 12,258 ఓట్లు సాధించి వరుసగా మూడు సార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 1967లో సంగిత వెంకటరెడ్డి పట్టాభిరామారావు దూకుడుకు బ్రేక్ వేశారు. కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగిన పట్టాభిరామారావుపై స్వతంత్ర అభ్యర్థిగా ఉన్న సంగిత వెంకటరెడ్డి పోటీ చేసి పట్టాభిరామారావుపై 2712 ఓట్లతో విజయం సాధించారు. జమిందార్ గెలుపునకు బ్రేక్ వేసిన నేతగా సంగిత రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు. 1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచిన జి.కమలాదేవి సమీప స్వతంత్ర అభ్యర్థి టి.సూరపురెడ్డిపై 16,968 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. పామర్రు నియోజకవర్గానికి ఐదు విడతలు ఎన్నికలు జరగ్గా నాలుగు సార్లు కాంగ్రెస్ పార్టీ, ఒకసారి స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు.

ఆలమూరు ఆవిర్భావం

1978లో పామర్రు నియోజకవర్గంలో ఉండే ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాలతో పాటు అనపర్తి నియోజకవర్గంలో ఉండే మండపేట మండలాన్ని ఏకం చూస్తూ ఆలమూరు నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గం ఏర్పడిన తర్వాత 1978లో జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన సంగిత వెంకటరెడ్డి జనతా పార్టీ నుంచి పోటీ చేసిన ఎస్‌బీబీకే సత్యనారాయణరావుపై 6,573 ఓట్ల ఆధిక్యతతో సంగిత గెలుపొందారు. ఆలమూరు నియోజకవర్గ తొలి ఎమ్మెల్యేగా సంగిత విజయం సాధించారు. 1983లో టీడీపీ అభ్యర్థి వల్లూరి నారాయణరావుపై కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన సంగిత 29,636 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 1985లో టీడీపీ తరఫున పోటీ చేసిన వల్లూరి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి వాలిన సూర్యభాస్కరరావుపై 20,371 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1989లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరఫున మూడో సారి బరిలో దిగిన వల్లూరి నారాయణరావు, కాంగ్రెస్ అభ్యర్థి సంగిత వెంకటరెడ్డిపై 978 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. 1994లో ఆలమూరు నుంచి టీడీపీ తరఫున వీవీఎస్ఎస్ చౌదరి కాంగ్రెస్ అభ్యర్థి సంగిత వెంకటరెడ్డిపై 16,710 ఓట్ల ఆధిక్యతతో చౌదరి గెలుపొందారు. 1999లో రెండోసారి టీడీపీ తరఫున పోటీ చేసిన చౌదరి తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి బిక్కిన కృష్ణార్జునచౌదరిపై 12,630 ఓట్లతో గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావుపై కాంగ్రెస్ అభ్యర్థి బిక్కిన కృష్ణార్జునచౌదరి 8017 ఓట్లతో గెలుపొందారు. ఆలమూరు నియోజకవర్గం ఉన్నంత వరకు ఏడు విడతలు ఎన్నికలు జరగ్గా టీడీపీ నాలుగు దఫాలు, కాంగ్రెస్ మూడుసార్లు గెలుపొందాయి. ఎన్నికలు 14 సార్లు జరిగినా ఇక్కడ గెలుపొందిన అభ్యర్థులు మాత్రం నలుగురు మాత్రమే.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ డీబీ లోక్

తోట త్రిమూర్తులుకు ఎమ్మెల్యే సీటు ఇవ్వడం సిగ్గుచేటు

దళిత ప్రజా సంఘాల సమావేశంలో వక్తల మండిపాటు

అమలాపురం రూరల్, మే 5: శిరోముండనం కేసులో శిక్ష పడ్డ తోట త్రిమూర్తులుకు ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వడం సిగ్గుచేటని దళిత ప్రజా సంఘాల సమావేశం ఆరోపించింది. మండపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న త్రిమూర్తులును చిత్తుగా ఓడించాలని శిరోముండనం బాధితుల న్యాయ పోరాట కమిటీ పిలుపునిచ్చింది. కామనగరువులోని బీవీ రమణయ్య కాలనీలో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం న్యాయ పోరాట కమిటీ సమావేశాన్ని ముఖ్య నాయకులతో నిర్వహించారు. దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్ మాట్లాడుతూ ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని వెంకటాయపాలెం దళిత యువకులు మూడు దశాబ్దాల పాటు చేసిన న్యాయ పోరాటం చరిత్రలో నిలుస్తుందన్నారు. బాధితులకు పూర్తి న్యాయం జరగకపోవడం ఆవేదన కలిగించిందన్నారు. త్రిమూర్తులు నేరస్తుడని నిర్ధారించి జైలు శిక్ష విధించినప్పటికీ వైసీపీ ఎమ్మెల్యే టిక్కెట్టు ఇవ్వడం దారుణమని విమర్శించారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడానికి ప్రభుత్వమే ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేయాలన్నారు. పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పోరాట కమిటీ సహ కన్వీనర్ రేవు నాగేశ్వరరావు, మానవహక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి యేడిద రాజేష్, డీబీఎంఎస్ జాతీయ కన్వీనర్ కొంకి రాజామణి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జనుపల్లి సత్తిబాబు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు అమలదాసు బాబూరావు, పీడీఎం నాయకులు దీపాటి శివప్రసాద్, శెట్టిబత్తుల తులసీరావు, నాయకులు బొంతు రమణ, మెండి డేవిడ్, గెద్దాడ బుద్ధరాజ్, కొండేపూడి రవి పాల్గొన్నారు.

కొవ్వూరులో నారా రోహిత్ ప్రచారం



కొవ్వూరులో ప్రచారం నిర్వహిస్తున్న నారా రోహిత్

కొవ్వూరు, మే 5: కొవ్వూరులో సినీ హీరో నారా రోహిత్ ఆదివారం కూటమికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, కూటమి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు తరపున ప్రచారంలో పాల్గొన్నారు. కొవ్వూరు పట్టణం, వేములూరు, తోగుమ్మి, వాడపల్లి, బంగారం పేట వరకు ప్రచారం చేశారు. భావితరాల భవిష్యత్, రాష్ట్ర అభివృద్ధి కోసమే కూటమి ఏర్పడిందన్నారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు సైకిల్ గుర్తుపై, పార్లమెంటు అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

రేపు కోరుకొండకు సీఎం జగన్ రాక

కోరుకొండ, మే 5: రాజానగరం నియోజకవర్గం కోరుకొండలో ఈ నెల 7న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు లక్ష్మీనరసింహస్వామి దేవాలయంవీధిలో ఈ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు.

అభిమానుల ప్రేమకు దాసోహం

పిఠాపురం నియోజకవర్గంలో హీరో సాయిధరమ్ తేజ్ ప్రచారం



రోడ్‌షోలో పాల్గొన్న సాయిధరమ్‌తేజ్



పూల వర్షం

పిఠాపురం/పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్, మే 5: 'మా సేనానిని గెలిపించండి, మీ అందరి ప్రేమకు మేమంతా దాసోహం అవుతాం' అని మెగా హీరో సాయిధరమ్‌తేజ్ అన్నారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ పిఠాపురం మండలం పాత కందరాడ, ఎఫ్‌కేపాలెం సెంటర్, కొత్త కందరాడ, కుమారపురం, పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు మీదుగా చిత్రాడ గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. అక్కడ నుంచి గొల్లప్రోలు మండలం చినజగ్గంపేట, తాటిపర్తి గ్రామాల్లో రోడ్‌షో కొనసాగింది. ఎఫ్‌కేపాలెం సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ నేను ఒక హీరోగా, పవన్‌కు మేనల్లుడిగా ప్రచారానికి రాలేదని, ఒక సేనానికి సైనికుడిగా ప్రచారానికి వచ్చినట్లు తెలిపారు. పవన్‌కల్యాణ్ ఎల్లప్పుడు ప్రజల పక్షాన నిలబడతారని చెప్పారు. మా సేనానిని గెలిపించండి, నియోజకవర్గ అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తారని తెలిపారు. వేసే ఓట్లకు ఈవీఎంలు పగిలేలా ఉండాలన్నారు. పోలింగ్ రోజున గాజుగ్లాసు మోత మోగాలని, ఫ్యాన్ రెక్కలు విరిగిపోవాలన్నారు. తనకు 2021లో రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు పిఠాపురం నియోజకవర్గంలోని అభిమానులు, ప్రజలు పురుహూతికా అమ్మవారికి పూజలు చేశారని వారందరికీ తాను రుణపడి ఉంటానని చెప్పారు. ప్రజల నుంచి సాయిధరమ్‌తేజ్‌కు అపూర్వ స్వాగతం లభించింది. అడుగడుగునా పూల వర్షంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జనసేన నేత డాక్టర్ పిల్లా శ్రీధర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభకు భారీ ఏర్పాట్లు

ఒంటి గంటకే సభా ప్రాంగణానికి చేరుకోవాలి
పార్కింగ్‌లోనే వాహనాలు నిలపాలి
ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ రాక సందర్భంగా అత్యంత పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సభా ప్రాంగణం, హెలిప్యాడ్ తదితర ప్రదేశాలను ఎస్‌ఎస్‌జీ తమ ఆధీనంలోకి తీసుకొంది. పెద్ద సంఖ్యలో పోలీసులను, కేంద్ర భద్రతా బలగాలను మోహరించారు. తనిఖీ బృందాలు అణువణువునూ జల్లెడ పడుతున్నాయి. ముఖ్యంగా పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలపాలని, ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయవద్దని ఎస్పీ జగదీశ్ సూచించారు. అటు విజయవాడ, ఇటు విశాఖ వైపు నుంచి వచ్చే వాహనాల కోసం వేర్వేరుగా పార్కింగ్ ప్రదేశాలు విశాలంగా ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ మళ్లింపులను గమనించుకుంటూ ప్రయాణించాలని ఆయన సూచించారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఒంటి గంటకే సభా ప్రాంగణానికి చేరుకోవాలి

ప్రధాని మోదీ చేరుకొనే హెలిప్యాడ్‌ల నుంచి సభా ప్రాంగణానికి హైవేతో కలుపుకొని 1.6 కిలోమీటర్ల దూరం ఉంది. మధ్యాహ్నం 1 గంట తర్వాత ఈ మార్గంతో పాటు వేమగిరి జంక్షన్ నుంచి సభా వేదిక వద్దకు చేరుకునే మార్గాలను భద్రతా బలగాలు పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుంటాయి. వాహనాలను, ప్రజలను అనుమతించరు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. తీవ్రమైన ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయి. అందువల్ల మధ్యాహ్నం 1గంటలోపుగానే సభా ప్రాంతానికి చేరుకొని నిర్దేశిత ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసి వేదిక వద్దకు ప్రజలు చేరుకోవాలని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇవే

రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లు దాటిన తర్వాత ఎడమవైపు పార్కింగ్ నెం.7, 8లో నిలుపుకోవాలి. కాస్త ముందుకు వెళ్లిన తర్వాత కూడా ఎడమవైపు కార్లు(నెం.6), ఆ వెనుక 4ఏ, 4బీ ప్రదేశాల్లో బస్సులు పార్క్ చేయాల్సి ఉంటుంది. కుడివైపున పార్కింగ్ నెం.5లో కార్లు, బస్సులు నిలపాలి. అలాగే వేమగిరి జంక్షను వైపు నుంచి వచ్చే వాహనాల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు ఎడమవైపున పార్కింగ్ నెం.2లో పెట్టాలి. కుడివైపున కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ నెం.1లో, ఈ పార్కింగ్ వెనుక పార్కిగ్ నెం.3లో బస్సులు నిలపాల్సి ఉంటుంది. వీవీఐపీ పాసులు ఉన్న వాహనాలను 4ఏ పార్కింగ్‌లో నిలపాలి. డయాస్ పాస్ ఉన్నవారు మీటింగ్ ప్రాంతంలో దిగి వారి వాహనాలను వేమగిరి జంక్షను దగ్గరలోని విందు రెస్టారెంట్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో పెట్టాలి. మధ్యాహ్నం 2గంటల నుంచి ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ, వేమగిరి జంక్షను నుంచి క్వారీ కెనాల్ రోడ్డు పీవీఆర్ ఎస్టేటు వద్ద ఏర్పాటు చేసి పార్కింగ్ నెం.5కి వాహనాలను మళ్లిస్తారు.

అభ్యర్థితో.. ఒకరోజు

ఒకపక్క ప్రచారం.. మరోపక్క వ్యూహరచనలు

» పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్పతో 'అభ్యర్థితో ఒకరోజు'

సామర్లకోట, మే 5: సార్వత్రిక ఎన్నికలకు సోమవారం నాటికి ఏడు రోజులు మాత్రమే సమయం ఉంది. దీంతో ఒకపక్క నియోజకవర్గంలో ఇంటింటా విస్తృత ప్రచారం నిర్వహిస్తూ బిజీబిజీగా ఉండే పెద్దాపురం నియోజకవర్గ కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్పతో ఆంధ్రజ్యోతి 'అభ్యర్థితో ఒకరోజు' చేసింది. ఈ సందర్భంగా ఆదివారం మొత్తం ఆయన దినచర్య గురించి తెలుసుకుందాం..



అచ్చంపేటలోని తన కార్యాలయంలో తన అనుచరులతో రాజప్ప సమీక్ష

ఉదయం 5.30గంటలకే లేచి..

పెద్దాపురం నియోజవర్గ కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప సామర్లకోట మండలం అచ్చంపేటలోని స్వగృహంలో ఉదయం 5.30 గంటలకే నిద్ర లేచారు. ఇంటి ఆవరణలో పార్క్‌లో 40 నిమిషాలపాటు వాకింగ్ నిర్వహించారు. అనంతరం స్నానాదికాలు పూర్తిచేసి అల్పాహారం స్వీకరించి సిద్ధయ్యారు. అప్పటికే ఎన్నికల ప్రచారానికి సిబ్బంది చేస్తున్న సన్నాహాలను పరిశీలించారు. అప్పటికే నియోజకవర్గంలో వివిధ గ్రామాలనుంచి తనతో మాట్లాడేందుకు ఇంటికి చేరుకున్న పలువురిని పలకరించారు. ఉదయం 10 గంటలకు తన కారులో వ్యక్తిగత సిబ్బందితో కలిసి అచ్చంపేట నుంచి సామర్లకోట మీదుగా పెద్దాపురం తరలివెళ్లారు. మార్గమధ్యలో సామర్లకోట లాకులవద్ద గోదావరి నీటిని మోటార్లతో పంపింగ్ చేస్తున్న పనులను చినరాజప్ప కారును రోడ్డు పక్కగా నిలిపి పరిశీలించారు. సదరు పంపింగ్ చేస్తున్న నీటిని కాకినాడ, పెద్దాపురం పట్టణాలకు తాగునీటిని సరఫరా చేసే సాంబమూర్తి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పెంచేందుకు కాకినాడ మున్సిపల్ సిబ్బంది కృషి చేస్తున్నట్లు అక్కడి సిబ్బంది ద్వారా సమాచారాన్ని సేకరించారు.



టీడీపీలో చేరుతున్న కార్యకర్తలకు కండువాలు వేస్తున్న రాజప్ప

టీడీపీలో చేరికలు

అక్కడినుంచి పెద్దాపురం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నాయకులతో కాసేపు మంతనాలు చేసి ఆదివారం కావడంతో క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో ప్రార్థనా మందిరాలకు విచ్చేయనున్నందున వారంద రి నీ కలిసి టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించాలని తలచి చర్చిలకు వెళ్లాలని నిర్ణయించారు. అదే స మయంలో పెద్దాపురం మండలం చినబ్రహ్మదేవం గ్రామానికి చెందిన ఆచంట గంగాధర్, కంచుమర్తి కాటంరాజు ఆధ్వర్యంలో తుట్ట వీరవెంకట రమణ, గుత్తుల దుర్గబాబు, వాసంశెట్టి సత్తిబాబు, గోనపల్లి వీరబాబు, కేతా పుల్లయ్య తదితర 15మంది వైసీపీ నా యకులు టీడీపీలోకి చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు.



పెద్దాపురం లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో చినరాజప్ప

ప్రార్థనా మందిరాల్లో ప్రచారం

అనంతరం పెద్దాపురం నాయకులతో కలిసి ప్రముఖ ప్రార్థనామందిరాలకు చేరుకున్నారు. చర్చిల్లో పలు క్రైస్తవ సోదర, సోదరీమణులను కలిసి రానున్న ఎన్నిక ల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గు ర్తుపైనా, కూటమి ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు గాజుగ్లాసు గుర్తుపైనా ఓట్లేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా చర్చి మతగురువులు కూట మి అభ్యర్థుల గెలుపు కాంక్షిస్తూ నిర్వహించిన సామూహిక ప్రార్థనలో పాల్గొన్నారు. పట్టణంలో లూథ రన్ చర్చి, కొండయ్యపేట చర్చి, స్వర్ణదేవాలయం, సినిమాసెంటర్ చర్చిలను ఎమ్మెల్యే సందర్శించి తన గెలుపును కాంక్షించారు. ఎమ్మెల్యే వెంట చర్చిల్లో పాల్గొన్నవారిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్ తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలోని వెలమ సామాజికవర్గం ఆత్మీయ సమావేశంలో ప్రసంగిస్తున్న చినరాజప్ప

కాకినాడలో వెలమ ఆత్మీయ సమావేశానికి హాజరు

అనంతరం చినరాజప్ప తనకారులో కాకినాడలో జరిగిన వెలమ ఆత్మీయ సమావేశానికి హాజరయ్యేందుకు చేరుకున్నారు. అప్పటికే అక్కడకు చేరు కున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను ఆత్మీయంగా పలకరించారు. వెలమల్లో కూటమి ప్రచా ర తీరుతెన్నులపై జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మ లబాబులతో కొద్దిసేపు వేదికపైనుంచే చర్చించారు. జిల్లా నలుమూలలనుంచీ సమావేశానికి హాజరైన వెలమలను ఉద్దేశించి ఎమ్మెల్యే చినరాజప్ప ప్రసంగించారు. వెలమ సంఘం ఆధ్వర్యంలో చినరాజప్పను శాలువా కప్పి పూలమాల వేసి సత్కరించారు.

అచ్చంపేటలో టీడీపీ నాయకులతో భేటీలు

కాకినాడ వెలమ ఆత్మీయ సమావేశంనుంచి 1.30 గంటలకు సామర్లకోట మండలం అచ్చంపేటలోని తన స్వగృహానికి చినరాజప్ప చేరుకున్నారు. అప్పటికే తన రాక కోసం ఎదురుచూస్తున్న ఉప్పలగుప్తం మండలం నుంచి విచ్చేసిన పలువురు టీడీపీ నాయకులతో కొద్దిసేపు సమీక్షించారు. తన సొంత మండలంగా ప్రసిద్ధి పొందిన ఉప్పలగుప్తంలో టీడీపీకి మెజార్టీ వచ్చేలా అందరూ కృషి చేయాలని తన అనుచరులను ఉత్సాహపరిచారు. అనంతరం రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని కందులపాలెం గ్రామానికి చెందిన విశ్వేశ్వరరావు తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే చినరాజప్పను కలిశారు. వచ్చిన వారందరితోనూ గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం 2 గంటలకు భోజనం నిమిత్తం తన గదిలోకి వెళ్లారు. భోజనానంతరం కొద్దిసేపు విశ్రమించేందుకు తన వ్యక్తిగత గదిలోకి వెళ్లారు. సాయంత్రం 4 గంటలకు తన గదినుంచి బయటకు వచ్చారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పలువురు నాయకులతోను, తనయుడు రంగనాగ్‌తోను విడివిడిగా చర్చించారు. పెద్దాపురం మండలం వడ్లమూరు, జి.రాగంపేట గ్రామాల్లో సాయంత్రం నుంచి చేపట్టనున్న ఎన్నికల ప్రచారానికి ఎవరెవరినీ తీసుకెళ్లాలి అనే అంశంపై తనయుడు రంగనాగ్‌తో చర్చించారు. 5గంటలకు అచ్చంపేటనుంచి సామర్లకోట మీదుగా జి.రాగంపేటకు ప్రచారం నిమిత్తం చేరుకున్నారు.

దొంగ నాటకం ఆడుతున్న జగన్



కాకినాడ వెలమ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ్, పాల్గొన్న నాయకులు

కాకినాడ సిటీ, మే 5: వైసీపీ ఐదేళ్ల పాలనలో బీసీలకు రూ.76వేల కోట్లు నష్టం కలిగించి నా బీసీ, నా బీసీ అంటూ జగన్ దొంగ నాటకం ఆడుతున్నాడని కాకినాడ పార్లమెంట్ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ విమర్శించారు. స్థానిక సూర్యకళామందిరంలో కాకినాడ జిల్లా వెలమ ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్ బీసీలకు చేసిన నష్టం అంతా ఇంతా కాదని, ఆయన్ను బీసీలు అసలు నమ్మవద్దని కోరారు. జిల్లాలో తుని, పెద్దాపురం, జగ్గంపేట, కాకినాడ రూరల్‌లో అత్యధికంగా ఉన్న వెలమల సంక్షేమం కోసం కృషి చేస్తానని, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. సమావేశానికి జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొబ్బిలి గోవిందు అధ్యక్షత వహించగా నాయకులు రాజాన రాజేశ్వర రావు, పెట్ల సత్యంగౌరి, ఈపి నాయుడు, అంకంరెడ్డి రామునాయుడు, పొన్నగంటి అనుపమ, సుర్ల సీతారాముడు, సిరికి శివ, కురచా జోగినాయుడు, అడిగర్ల గంగబాబు, చిలుకు గంగబాబు పాల్గొన్నారు.

ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించాలి

కాకినాడ పార్లమెంట్ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు ఆదివారం కాకినాడ పోర్టులో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. పోర్టులో కార్మికులకు మేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ గ్లాసు గుర్తుపై ఓటు వేసి ఎంపీగా ఉదయ్ శ్రీనివాస్‌ను, సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా కొండబాబును గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటుతోనే కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించనుందన్నారు.

కాకినాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్

అందరి సంక్షేమానికి ప్రాధాన్యం : తంగెళ్ల

గొల్లప్రోలు రూరల్, మే 5: సమాజంలో అందరి సంక్షేమానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రాధాన్యత ఇస్తుందని జనసేన కూటమి కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఒక ఫంక్షన్‌హాలులో ఆదివారం కాకినాడ జిల్లా ఒంటరి దొరల ఆత్మీయ సమావేశం జరిగింది. హాజరైన తంగెళ్ల మాట్లాడుతూ పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్, తనను, ఇతర కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం జిల్లాలోని ఒంటరి దొరలందరూ కూట మికి మద్దతు ప్రకటిస్తున్నట్టు తీర్మానించారు. సమావేశంలో ఏపీ హైకోర్టు అడ్వకేట్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కేటీ రామన్నదొర, ప్రముఖ పర్యావరణవేత్త బొలిశెట్టి సత్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలకూరి రామకుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, నందమూరి వీరవెంకట వినోద్, రాజా, రాజా యెన్నుల ముల్లుదొర, సూరవరపు కృష్ణార్జునరావు, గంటా బాలుదొర, బొప్పన రాము పాల్గొన్నారు.



చేబ్రోలు సమావేశంలో మాట్లాడుతున్న తంగెళ్ల

కూటమిపై వైసీపీ నేతల తప్పుడు ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, మే 5: టీడీపీ-జనసేన-బీజేపీ కూ టమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చర్చిలు కూ ల్చి వేస్తారంటూ వైసీపీ నాయకులు, ఎమ్మెల్యే అభ్య ర్థి వంగా గీత తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురంలో ఆదివారం రాత్రి దళితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ వారిని పట్టించుకోవడం మానివేయడమే గాక ఎస్సీల సంక్షేమానికి సంబంధించిన 27 పథకాలను రద్దు చేశారన్నారు. చంద్రబాబు 14ఏళ్లు సీఎంగా పనిచేసినప్పుడు ఒక చర్చిని కూడా కూల్చిన చరిత్ర లేదన్నారు. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి అయ్యేది చంద్రబాబేనని తెలిపారు. జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించేందుకుగాను చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బీజేపీ మద్దతు తీసుకున్నారని తెలిపారు. పిఠాపురంలో మతసామరస్యాన్ని కాపాడేందుకు పాస్టర్లు సహకరించాలని, 2ఓట్లు జనసేనకు వేసి పవన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ నేతలు మడికి ప్రసాద్, నూతాటి ప్రకాష్, దొమ్మేటి మనోహర్, దుర్గాడ విజయలక్ష్మి, ముత్యాల దివ్య, ఇజ్జన కాసులు, దారా త్రిమూర్తులు, వేమగిరి రాంబాబు, అందుగుల సత్తిబాబు పాల్గొన్నారు.

దళితుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వర్మ

పవన్‌కు ఒక అవకాశం ఇవ్వండి

కోనపాపపేట(కొత్తపల్లి), మే 5: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరపున పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పవన్‌కల్యాణ్‌కు ఒక అవకాశం ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ సతీమణి లక్ష్మీదేవి కోరారు. కోనపాపపేట తీరప్రాంతగ్రామాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఉప్పాడ క్రీస్తుప్రార్థనా మందిరాలు, వాకతిప్ప శెట్టిబలిజపేటల్లో జనసేన శ్రేణులు ప్రచారంచేశారు. మత్స్యకార నాయకులు కొర్ని వెంకటరమణ, జనసేన నాయకులు పల్లేటి బాపన్నదొర, సానా నాగు, మామిడి మల్లిబాబు, చ వ్వాకుల వెంకటరమణ, బందననందీశ్వరి పాల్గొన్నారు.

ఓడిపోతామని తెలిసి వైసీపీ దాడులు : వర్మ

పిఠాపురం, మే 5: ఎన్నికల్లో ఓడిపోతామనే తెలిసి పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ప్రోద్బలంతోనే హీరో సాయిధరమ్‌తేజ్‌పై వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడ్డాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. సాయిధరమ్‌తేజ్‌పై విసిరిన డ్రింక్‌సీసా తగిలి తీవ్రంగా గాయపడిన జనసైనికుడు, టీడీపీ సానుభూతిపరుడు నల్లల శ్రీధర్‌ను ఆదివారం రాత్రి ఆయన పిఠాపురం ప్రభుత్వాస్పత్రిలో పరామర్శించారు. దాడిని తీవ్రంగా ఖండించారు. పోలీసులకు తెలిసే ఈ దాడి జరిగిందన్నారు. ఇప్పటివరకూ ఎవరినీ అదుపులోకి తీసుకోకపోవడంపై ఆగ్రహంవ్యక్తం చేశారు. సోమవారం ఉదయం లోగా దాడికి పాల్పడిన వారిని, ఘర్షణకు దిగిన వారిని అరెస్టు చేయకుంటే ఎస్పీ కార్యాలయం, గొల్లప్రోలుపోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్

కలెక్టర్ జె.నివాస్

కలెక్టరేట్ (కాకినాడ), మే 5: ఇతర జిల్లాల్లో ఓటుకలిగి కాకినాడ జిల్లాలో సాధారణ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫెసిలిటేషన్ కేంద్రంలో ఈనెల 7,8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఓటుహక్కు కలిగి కాకినాడ జిల్లాలో ఎన్నికల విధుల్లో పనిచేస్తున్న సిబ్బంది ఈనెల 7న వినియోగించుకోవాలన్నారు. తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాలో ఓటుహక్కు కలిగి కాకినాడ జిల్లాలో ఎన్నికల విధుల్లో పనిచేస్తున్న సిబ్బంది ఈనెల 8న కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు.

4520మంది పోస్టల్ బ్యాలెట్

జిల్లాలో ఆదివారం ఒక్కరోజే 4520మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినిగించుకున్నారని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిలో తుని నియోజకవర్గంలో 585, ప్రత్తిపాడులో 335, పిఠాపురంలో 764, కాకినాడలో 1207, పెద్దాపురంలో 510, కాకినాడ సిటీ నియోజకవర్గంలో 773, జగ్గంపేట నియోజకవర్గంలో 346మంది ఉద్యోగులు ఓటు వేశారన్నారు. రెండురోజులుగా మొత్తం 7944మంది ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకున్నారని చెప్పారు.

ఉద్యోగులకు ఒకరోజు సాధారణ సెలవు

ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఒకరోజు ప్రత్యేక సాధారణ సెలవును మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులను జారీ చేశారని కలెక్టర్ నివాస్ తెలిపారు. ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్‌తో ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు.

వైసీపీ నాయకుడి నిర్వాకంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న కృష్ణ

కాకినాడ క్రైం, మే 5: వైసీపీ నాయకుడి నిర్వాకంతో ఓ తాపీమేస్త్రీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రాణాపాయస్థితిలో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడరూరల్ మండలం స్వామినగర్‌కు చెందిన 25ఏళ్ల మొక్కరాల కృష్ణ తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తూ ఉంటాడు. కాగా స్థానిక వైసీపీ నాయకుడైన కోరాడ దుర్గాప్రసాద్‌రెడ్డి మూడేళ్ల క్రితం రూ.3లక్షలు ఇస్తే ఇంటి స్థలం పట్టా ఇప్పిస్తానని కృష్ణను నమ్మించాడు. దీంతో కృష్ణ రూ.3లక్షలు అప్పు చేసి అతడు మేనమామ అయిన ఆకుల సత్తిబాబును మధ్యవర్తిగా పెట్టి దుర్గాప్రసాద్‌రెడ్డికి నగదును ముట్టచెప్పాడు. ఏళ్లు గడుస్తున్నా అప్పు చేసిన డబ్బుకు కృష్ణ తన కష్టార్జితంతో వడ్డీ కడుతున్నాడే తప్ప దుర్గాప్రసాద్‌రెడ్డి నుంచి కృష్ణకు ఇంటి పట్టా రాలేదు. అతడు ఇచ్చిన సొమ్ము తిరిగి ఇవ్వకపోవడంతో కృష్ణ తన మేనమామ సత్తిబాబుపై ఒత్తిడి తెచ్చాడు. దుర్గాప్రసాద్‌రెడ్డి అంటే భయంతో సత్తిబాబు తప్పించుకుపోయేవాడు. ఈక్రమంలో కృష్ణ రెండు, మూడుసార్లు నేరుగా దుర్గాప్రసాద్‌రెడ్డిని కలిసి ఇంటి పట్టా ఎటూ ఇవ్వలేదు, వడ్డీ కట్టలేకపోతున్నాను. కనీసం తీసుకున్న రూ.3లక్షలైనా ఇవ్వమని ప్రాధేయపడేవాడు. దానికి దుర్గాప్రసాద్‌రెడ్డి అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేయసాగాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కృష్ణ మరోసారి దుర్గాప్రసాద్‌రెడ్డి వద్దకు వెళ్లి తాను ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వమ్మని అడగడంతో కోపోద్రిక్తుడైన దుర్గాప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో కృష్ణను కొట్టించేందుకు ప్రయత్నించాడు. దీంతో కృష్ణ అక్కడినుంచి తన ఇంటి వద్దకు వెళ్లిపోయాడు. తీవ్ర మనస్తాపానికి గురైన అతడు ఆదివారం రాత్రి 8గంటల సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు తీవ్ర అస్వస్థతకు గురైన కృష్ణను జీజీహెచ్‌కు తరలించగా ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఇంద్ర పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా నీట్ పరీక్ష

కాకినాడ రూరల్, మే 5: వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాలకోసం జాతీయస్థాయిలో నిర్వహించే నీట్ పరీక్ష ఆదివారం కాకినాడ పరిధిలో ఏర్పాటు చేసిన 7కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగినట్లు పరీక్ష కాకినాడ సిటీ కోఆర్డినేటర్ బొంత శేఖర్ తెలిపారు. ఈ పరీక్షను ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకూ నిర్వహించారు ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్, లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్, అక్షర, గ్రీన్ ఫీల్, శ్రీచైతన్య ఈటెక్నో స్కూల్, సుభానికేతన్, శరణ్య పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు 3,097మంది విద్యార్థులకుగాను 3021మంది హాజరుకాగా 76మంది పరీక్ష రాయలేదని తెలిపారు.

నూకాలమ్మ జాతరలో భక్తుల రద్దీ

పెద్దాపురం, మే 5: భక్తుల కొంగు బంగారం కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా నాల్గో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు, ఈవో టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. సుమారు 10 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారు.

కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు తోడుగా నిలవాలి

కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు



37వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న వనమాడి కొండబాబు

కాకినాడ సిటీ, మే 5: ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం ద్వారా సంపదను సృష్టించి ఆ సంపదను ప్రజలకు పంచే సమున్నత లక్ష్యం కలిగిన ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు కాకినాడ ప్రజలు తోడుగా నిలవాలని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం 37వ డివిజన్‌లో పర్యటించి టీడీపీ కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ల్యాండ్, శాండ్, వైన్, మైన్ లాంటి విధానాలతో రాష్ట్రాన్ని, ప్రజల సంపదను జగన్‌రెడ్డి దోచుకున్నాడన్నారు. ఇక్కడ జగన్‌రెడ్డి బినామీ ద్వారంపూడి కాకినాడ ప్రజల కష్టార్జితాన్ని, ఉమ్మడి జిల్లాలోని వనరులను కొల్లగొడుతూ వేలకోట్లు దోచుకున్నాడన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచి ప్రజలకు అండగా నిలిచి సంక్షేమ పథకాలు అందించే ఏకైక విజనరీ లీడర్ చంద్రబాబు అని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి సంతకంతో డీఎస్సీని నిర్వహించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి తొలి వంద రోజుల్లోనే గంజాయి, డ్రగ్స్ కల్తీ మద్యం లేని రాష్ట్రంగా చేయనున్నారన్నారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించి సామాన్యులకు అండగా నిలిచి నియోజకవర్గంలో భూ కబ్జాలను అరికట్టి తాగునీటి సమస్యలు పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు మల్లాడి గంగాధరం, మల్లాడి నూకేష్, బలసాడి శ్రీను, పాలెపు ధర్మారావు, మల్లాడి నాగరాజు, రేవు సురేష్, మాతా చిన్ని, పోతాబత్తుల రాంబాబు, లంకే ధర్మారావు, పినపోతు సత్తిబాబు, జనసేన, టీడీపీ నాయకులు సంగిశెట్టి అశోక్, యాళ్ల రామకృష్ణ, గుత్తుల రమణ, ఎస్‌కే రహీమ్ పాల్గొన్నారు.

పెద్దసంఖ్యలో యువకులు టీడీపీలో చేరిక

16వ డివిజన్‌కు చెందిన పెద్దసంఖ్యలో యువకులు టీడీపీలో చేరారు. వారికి కూటమి వనమాడి కొండబాబు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. స్థానిక 28వ డివిజన్‌లో వనమాడి శివప్రసాద్ పర్యటించి కొండబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.





టీడీపీలో చేరినవారితో వనమాడి కొండబాబు, 28వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వనమాడి శివప్రసాద్

అత్యంత పారదర్శకంగా ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ

కలెక్టర్ జె.నివాస్

ప్రత్తిపాడు, మే 5: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అత్యంత పారదర్శకంగా ఈవీఎం యూనిట్లలో బ్యాలెట్ పత్రాలు జోడించే కమిషనింగ్ ప్రక్రియ జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఆదివారం ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి మినర్వా విద్యాసంస్థలో నిర్వహిస్తున్న ఈవీఎం, వీవీ ప్యాట్స్ కమిషనింగ్ ప్రక్రియను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈవీఎం,వీవీ ప్యాట్స్ కమిషనింగ్ ప్రక్రియలో భాగంగా ఈవీఎం యూనిట్‌కు బ్యాలెట్ పత్రాన్ని అనుసంధానం జరుగుతుందని తెలిపారు. తొలుత నియోజకవర్గానికి సంబంధించిన జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పోస్టల్‌బ్యాలెట్ పోలింగ్ నిమిత్తం ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్‌కేంద్రంలోని సదుపాయాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రత్తిపాడు ఆర్వో ఎ.శ్రీనివాసరావు, ఎన్నికల అధికారులున్నారు.



ప్రత్తిపాడులో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

తునిలో కలెక్టర్ పరిశీలన

తుని రూరల్, మే 5: నియోజకవర్గానికి సంబంధించి తుని బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లో సదుపాయాలను కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్వో ఈ.రామలక్ష్మితో కలిసి పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఆదివారం 585 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకోగా ఇప్పటికీ నియోజకవర్గంలో 601 మంది ఓటుహక్కు వినియోగించుకున్నట్టు ఆర్వో తెలిపారు.

ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభం

కార్పొరేషన్ (కాకినాడ), మే 5: కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. ఎన్నికలకు ఈవీఎంలను సిద్ధం చేసే క్రమంలో భాగంగా బ్యాలెట్ పత్రాలు, అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను ఈవీఎంల్లో నిక్షిప్తం చేసే కమిషనింగ్ విధానాన్ని స్థానిక మెక్లారిన్ గ్రౌండ్స్ ఆవరణలోని ఓటర్ల సామాగ్రి పంపిణీ కేంద్రంలో చేపట్టారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్, సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షించారు. వారి వెంట డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, డిప్యూటీ తహశీల్దార్లు నాయుడు, పవన్ పాల్గొన్నారు.



కాకినాడలో ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న సాధారణ పరిశీలకులు, ఆర్వో

నకిలీ నవరత్నాలతో మోసం చేసిన వైసీపీ

ముమ్మిడివరం కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు



అవ్వతాతలను ఓట్లు అభ్యర్థిస్తున్న దాట్ల బుచ్చిబాబు

తాళ్లరేవు, మే 5: నకిలీ నవరత్నాలతో ప్రజలను మోసం చేసిన వైసీపీ పాలన అంతానికి రోజులు దగ్గరపడ్డాయని ముమ్మిడివరం కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి టేకుమూడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో పటవల, కొత్తూరు, రాఘవేంద్రపురం, రామన్నపాలెం, ఐబీసీకాలనీ, శాంతమూల గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు, మహిళలు గజమాలలతో ఘనస్వాగతం పలికుతూ కర్పూర హారతులిచ్చారు. దాట్ల మాట్లాడుతూ ఈనెల 13న ఎన్నికల్లో రెండు ఓట్లును సైకిల్‌గుర్తుపై వేసి అఖండమెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీనేతలు గాజుల విష్ణుచక్రం, మేడిశెట్టి గోపాల్, బీర రాజేష్, వీరబాబు చౌదరి, సర్పంచ్‌లు బీర మాలయ్య, పుణ్యమంతుల సూరిబాబు, సిద్దన సీతారామయ్య, మేకల కృష్ణ, బోరుసు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల్లో ప్రజలంతా తమ అమూల్యమైన ఓట్లు సైకిల్‌గుర్తుపై వేసి గెలిపించాలని మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు వుంగరాల వెంకటేశ్వరరావు, అత్తిలి బాబూరావు, మోపూరి శ్రీనివాసకిరణ్, బండారు దొరబాబు, చిక్కం శ్రీరామచంద్రుడు, సుందరపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు పెమ్మాడి కృష్ణవేణి రామన్నపాలెంలో ఇంటింటా ప్రచారం చేశారు. మహిళా నేతలు పితాని హేమలత, బొడ్డు రాజేశ్వరి, రామలక్ష్మి, వెంటపల్లి ఉమామహేశ్వరి,ఎంపీపీ రాయుడు సునీత, మాజీఎంపీపీ టేకుమూడి అనంతలక్ష్మి, మోకా కస్తూరి, ముత్యాల జయలక్ష్మి పాల్గొన్నారు.

వైసీపీకి ఎంపీపీ రాజీనామా

తాళ్లరేవు వైసీపీకి చెందిన మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు రాయుడు సునీత, రాయుడు గంగాధర్‌లు ఆ పార్టీకి రాజీనామా చేసి మట్లపాలెం మహాలక్ష్మమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, చిక్కాల రామచంద్రరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ప్రజా సంక్షేమం కూటమితోనే సాధ్యం : రాజప్ప

పెద్దాపురం, మే 5: ప్రజా సంక్షేమం కూటమితోనే సాధ్యం అని నియోజకవర్గ కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామంలో ఆయన ఆదివారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు.. ప్రతీ ఇంటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు సైకిల్‌కు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. మహిళలు, ప్రజలు ఆయనకు అడుగడుగునా స్వాగతం పలికి హారతులిచ్చారు. రాజప్ప మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనుకబడిందన్నారు. కూటమి అధికారం చేపట్టడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు మెరుగుపడుతుందన్నారు. కూటమిని ప్రజలు ఆదరిస్తున్నారని, ఈఎన్నికల్లో కూటమికి విజయం తథ్యమన్నారు. ప్రజలు రాష్ట్ర భవిష్యత్తు, భావితరాల బాగు కోసం టీడీపీకి ఓటువేయాలని కోరారు.



వడ్లమూరులో ప్రచారం నిర్వహిస్తున్న చినరాజప్ప

అలాగే పెద్దాపురంలో పలు క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాలచర్ల ఉమామహేశ్వరరావు, దేవళ్ల సతీష్, బీజేపీ నేత విత్తనాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు



గండేపల్లి: పార్టీలో చేరినవారితో నాగబాబు

గండేపల్లి, మే 5: ఎన్నికల్లో కూటమిని అత్యంత మెజార్టీతో గెలిపించేందుకు తన వంతు కృషిచేస్తానని మండలంలో ఉప్పలపాడు గ్రామానికి చెందిన మేడిబోయిన శ్రీను, అబ్బులు అన్నారు. ఆదివారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో సుమారు 200మంది అనుచరులతో బైక్ ర్యాలీగా చేబ్రోలు వెళ్లి పవన్‌కల్యాణ్ నివాసంలో జనసేన నేత నాగబాబు సమక్షంలో పార్టీలో చేరారు. నాగబాబు మాట్లాడుతూ ఈ ఎన్నికలు చాలా కీలకమని, కూటమిని గెలిపించుకుంటే రాష్ట్రాభివృద్ధి ఉంటుందన్నారు.

సర్పవరం జంక్షన్: కాకినాడ రూరల్‌లో నేమానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు రేవు రాజు ఆధ్వర్యంలో 30 మంది వైసీపీ కార్యకర్తలు జనసేనలో చేరారు. కార్పొరేషన్ 3వ డివిజన్ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నాయకుడు కట్టా సత్తిబాబు ఆధ్వర్యంలో 60 మంది పార్టీ కార్యకర్తలు పార్టీలో చేరారు. వారికి కాకినాడ రూరల్ అసెంబ్లీ జనసేన అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సంక్షేమం,అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

పాదగయలో ద్రోణంరాజు పూజలు

పిఠాపురం, మే 5: పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని అఖిల భారత ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్ సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఆలయ ఈవో పులి నారాయణమూర్తి ద్రోణంరాజుకు స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట బ్రాహ్మణ సంఘాల నాయకులు ఉన్నారు.



పాదగయ క్షేత్రంలో ద్రోణంరాజు రవికుమార్

'భూములపై కన్నేసిన వైసీపీ'

ఏలేశ్వరం, మే 5: ల్యాండ్ టైటిలింగ్ పేరుతో వైసీపీ నాయకులు భూములను దొంగలించాలని చూస్తున్నారని జనసేన పార్టీ ప్రత్తిపాడు ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు మండిపడ్డారు. మండలంలోని సిరిపురం, చిన్నింపేట గ్రామల్లో ఆదివారం కూటమి నాయకులు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో తమ్మయ్యబాబు, వరుపుల శ్రీసాయి తర్శిత్ కూటమి మేనిఫెస్టోను ప్రజలకు పంచి ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పోటీ చేస్తున్న తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు గాజు గ్లాసు గుర్తుపై తమ అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం తమ్మయ్యబాబు మాట్లాడుతూ రైతులను మోసం చేసి ల్యాండ్ టైటిల్ చట్టం ద్వారా తమ భూములను కోల్పోయే విధంగా ముఖ్యమంత్రి వ్యవహార శైలి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, డాక్టర్ విజయబాబు, అచ్చే వీరబాబు, ధనేకుల వీర భద్రరావు, వోనుం మంగ, తాడి వెంకట రమణ, కొల్లా శ్రీనివాస్, మైరాల కనకారావు, అలమండ చలమయ్య, పాంద్రంకి అప్పారావు, బుగతా శ్రీను, కడింశెట్టి వాసు, బెల్లాని శ్రీను, వాగు రాజేష్, కూటమి నాయకులు ఉన్నారు.

ప్రత్తిపాడు: రాష్ట్రంలో ల్యాండ్ టైటలింగ్ పేరుతో భూ దందాలకు తెరలేపారని ప్రత్తిపాడు జనసేన పార్టీ వరుపుల తమ్మయ్యబాబు విమర్శించారు. ప్రత్తిపాడు మండలం ఏలూరులో ఆదివారం కూటమి ప్రత్తిపాడు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అభ్యర్థులు వరుపుల సత్యప్రభ రాజా, తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన నాయకులు పెంటకోట మోహన్, కార్యకర్తలున్నారు.

కాంగ్రెస్‌తోనే విభజన హామీల అమలు

కాకినాడ సిటీ, మే 5: పార్లమెంట్‌లో ఆంధ్ర రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీల అమలు ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమని కేంద్ర మాజీ మంత్రి, కాకినాడ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు అన్నారు. కాకినాడ సిటీ అసెంబ్లీ అభ్యర్థి చెక్క నూకరాజుతో కలిసి ఆయన ఆదివారం కాకినాడ నగరంలో ప్రచారం నిర్వహించారు. జగన్నాథపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి జగన్నాథపురం చిన్నమార్కెట్‌వీధి, ముత్తానగర్, చార్లీస్ రోడ్, మున్సబు జంక్షన్, నరసింహారోడ్, ఎన్టీఆర్ బ్రిడ్జి, సినిమారోడ్ సాలిపేట, జవహర్‌వీధి, రామారావుపేట ప్రాంతాల్లో పర్యటించి హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఐ బ్యాంక్‌కు ఆర్థిక సాయం

కాకినాడ రూరల్, మే 5: కాకినాడలోని బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు దేగల వీరభద్రరావు, మహాలక్ష్మీ దంపతులు ఐ బ్యాంక్ అభివృద్ధి నిమిత్తం రూ.1,00,000 చెక్కును విరాళంగా ఆదివారం చైర్మన్ దామెర విజయలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ఐబ్యాంక్ కార్యదర్శి డాక్టర్ బాదం బాలకృష్ణ, మోహన్‌రావు, ఫణీంద్ర, వేణి, రమాదేవి, నానాజీ ఉన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలందరికీ మేలు

జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మే 5: జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామంలో నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ ఆదివారం ఉదయం చైతన్య రథంపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందించే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలందరికీ మేలు జరుగుతుందని తెలిపారు. గ్రామంలో అన్ని సమస్యలు తీర్చి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తానన్నారు. తనా రాజకీయ ప్రస్థానం 1981లో ప్రారంభమైందని, అప్పటి నుంచి మల్లిశాలలో అందరూ అండగా నిలిచారని, మళ్లీ ఇప్పుడు గ్రామంలో పర్యటిస్తుంటే ప్రతి ఒక్కరి మోములో చిరునవ్వులో అప్యాయంతో స్వాగతం పలికిన తీరు చూస్తుంటే మళ్లీ పునఃవైభవంగా తిరిగి రావడంతో చాలా ఆనందంగా ఉందన్నారు. నెహ్రూకు పూలవర్షంతో జన నీరాజనాలతో మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఎన్నికల్లో సైకిల్‌గుర్తుపైన, గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేయాలని జ్యోతుల నెహ్రూ ప్రజలను కోరారు. కార్యక్రమంలో పైడిపాల సూరిబాబు, సర్వసిద్ది లక్ష్మణరావు, సియాదుల పెద్దకాపు, కానవరెడ్డి రామకృష్ణ, ముండ్రు ఎర్ర బాబు, పైడిపాల సత్తిబాబు, పల్లికొండ భద్రం, సేవావెంకన్నబాబు, తోగరు యేసుబాబు, తొట్టిపూడి నాగేశ్వరరావు, ఇంజరపు దుర్గ, ముత్తా రాజబాబు, గుమ్మల అనంతలక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

జగ్గంపేట మండలం మల్లిశాల క్లస్టర్ ఇన్‌చార్జి పైడిపాల సూరిబాబు ఇంటి వద్ద గోకవరం మండలం గాదేలపాలెం గ్రామానికి చెందిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైసీపీ ఎస్టీసెల్ అధ్యక్షులు దుక్కర అబ్బులు(దత్తుడు) వైసీపీకి రాజీనామా చేసి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు, అడపా భరత్, గుండా శివప్రసాద్, గల్లా రాము, గుర్తిత్తి త్రిమూర్తులు, చిక్కంసాయి, పాల్గొన్నారు. జగ్గంపేట మండలం వెంగయమ్మ పురం మాజీ సర్పంచ్ గొల్లవిల్లి వరలక్ష్మి బాబ్జి, అప్పాన వరలక్ష్మి, అప్పాన తాతబాబు, అప్పాన మరిడియ్య వైసీపీకి రాజీనామా చేసి నెహ్రూ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వల్లెపు అన్నవరం, అప్పాన వీరబాబు, దశరధ బాపూజీ, అప్పాన అన్నమయ్య, వల్లెపు సత్యనారాయణ, గెద్దం అన్నవరం, జనసేన మండలాధ్యక్షులు మరిసే రామకృష్ణ, బొండా శ్రీను పాల్గొన్నారు. గోకవరం మండలం తిరుమలయపాలెనికి చెందిన పదోవార్డు నెంబరు పెనుగల కృష్ణ, సోమరాజు, పోతుల నారమ్మ, నూతలపాటి గౌరమ్మ, తదితర 10 కుటుంబాలు నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. సర్పంచ్ పురంశెట్టి శివాజీ, వల్లేపల్లి సత్యనారాయణ, కోడూరి సత్యనారాయణ, ఉండమట్ల దొరబాబు ఉన్నారు.



ప్రచారంలో నెహ్రూకు హారతులు పడుతున్న మహిళలు



నెహ్రూను పూలమాలతో సన్మానిస్తున్న దృశ్యం



ప్రచారంలో ప్రజలను నమస్కరిస్తున్న జ్యోతుల నెహ్రూ

తోట సునీత ప్రచారం

కిర్లంపూడి: జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత వీరవరంలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఎంపీపీ తోట రవి, జడ్పీటీసీ తోట సత్యవతమ్మ, తోట గాంధీ, తోట సర్వారాయుడు ఆధ్వర్యంలో ప్రచారం జరిగింది.



వీరవరంలో ప్రచారం నిర్వహిస్తున్న తోట సునీత

జగన్‌కు గుణపాఠం చెప్పేందుకు సిద్ధం

ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ





శంఖవరం: ప్రచారం నిర్వహిస్తున్న వరుపుల సత్యప్రభ, ప్రత్తిపాడు: సత్యమాధురిని సన్మానిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు, మే 5: సీఎం జగన్ పాలనపై విసుగుపోయిన ప్రజలు ఆయనకు ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగాఉన్నారని ఎన్డీయే కూటమి ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని ధర్మవరంలో పుణ్యమంతుల రాజా శ్రీనుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని ఆదివారం సాయంత్రం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమ పాలన అందించే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, మోదీ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుకానుందన్నారు. ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయం వద్ద రాఘవపట్నం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ రొబ్బ వెంకటరమణ అనుచరులు వైసీపీని వీడి సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే సత్యప్రభ కుమార్తె సత్యమాధురి ధర్మవరం టీడీపీ నాయకులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముదునూరి మురళీకృష్ణంరాజు, మాజీ మండల ఉపాధ్యక్షుడు బొల్లు కొండబాబు, మాజీ సొసైటీ అధ్యక్షులు దాట్ల అప్పన్నబాబు, దాట్ల కృష్ణబాబు, ఇంధన ఏసుబాబు, బొండాడ నారాయణ, కొప్పుల సత్యనారాయణ, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దాసం శేషారావు, యర్రాబత్తుల గోవిందనాయుడు కోలా తాతబాబు పాల్గొన్నారు. ప్రత్తిపాడులో సత్యప్రభ కుమారుడుసాయి తర్శిత్ ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు, మూరా వరప్రసాద్, మాజీ ఎంపీటీసీ శెట్టిబత్తుల వీరబాబు, స్థానిక పోలిశెట్టి శ్రీనివాస్, విజయ్, రావూరి తాతాజీ తదితరులున్నారు. కూటమి అభ్యర్థి సత్యప్రభను జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, జిల్లా నాయకులు సింగిలిదేవ్ సత్తిరాజు, కర్రి ధర్మరాజు, కొయ్యా శ్రీనివాస్ కలిశారు. కూటమితో కలిసికట్టుగా చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. నియోజకవర్గ బీజేపీ ఎన్నికల కన్వీనర్‌గా సింగిలిదేవ్ సత్తిరాజు నియమితులుకావడంతో శాలువా కప్పి సన్మానించారు. నాయకులు కూరాకుల రాజా, మదినే బాబ్జి, దిడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

శంఖవరం: ఎమ్మెల్యేగా నెగ్గిస్తే ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని వరుపుల సత్యప్రభరాజా అన్నారు. శంఖవరం మండలంలోని గొందికొత్తపల్లి, యస్.జగ్గంపేట, శంఖవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు వెన్నా ఈశ్వరుడు, టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, ఉల్లివీరబద్రరావు, పర్వత సుభాష్ తదితరులున్నారు.

టీడీపీలో చేరిక

రౌతులపూడి: ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభరాజాను అత్యధిక మెజార్టీలతో గెలిపించాలని సీరియల్ నటుడు ఇంద్రనీల్ వర్మ టీడీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ తమరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో మూలపూడిలో ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ యామల సురేష్ పాల్గొన్నారు. రౌతులపూడి, కొత్తమల్లంపేటకి చెందిన వైసీపీ నుంచి ఉపసర్పంచ్ రొబ్బారమణ, వైసీపీ యువనేత కోరుప్రోలు బుజ్జీబాబునాయుడు, పలువురు సత్యప్రభ సమక్షంలో టీడీపీలో చేరారు. పారుపాక, ఎమ్.కొత్తూరు, రామకృష్ణాపురం, దారపల్లిలో సత్యప్రభకు మద్దతుగా కొసూరి కృష్ణవర్మ, కరణం సుబ్రహ్మణ్యం, ఎన్.నాగు, పక్కుర్తి సతీష్ ప్రచారం చేశారు.



ప్రత్తిపాడులో కరపత్రాలు అందజేస్తున్న సాయి తర్శిత్

దంపతుల ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ భర్త మృతి

తొండంగి, మే 5: కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా దంపతులు ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందతూ భర్త మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఎస్‌ఐ వినయ్ ప్రతాప్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొండంగి గ్రామానికి చెందిన లోకారెడ్డి శ్రీనివాస్, సౌజన్యలకు ఏడాది క్రితం వివాహమైంది. ఆర్థిక సమస్యల కారణంగా శనివారం ఇద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు వారిని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ ఆదివారం మృతిచెందాడు. సౌజన్య చికిత్స పొందుతోందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కిర్లంపూడి, మే 5: చింతచెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతిచెందిన సంఘటన కిర్లంపూడి మండలంలో జరిగింది. కిర్లంపూడి ఎస్‌ఐ జబీర్ తెలిపిన వివరాలు ప్రకారం.. జగపతినగరం గ్రామానికి చెందిన పోలిశెట్టి సుధాకర్ (53) అనారోగ్య కారణాల వల్ల భార్యాపిల్లలు అతడిని విడిచిపెట్టడంతో ఒంటరిగా ఉండేవాడు. దీంతో మనస్థాపం చెందిన సుధాకర్ ఆదివారం తెల్లవారుజామున గ్రామ శివారున చింత చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

బంగారు గొలుసు చోరీపై కేసు

గండేపల్లి, మే 5: నిద్రించే సమయంలో మెడలో ఉన్న బంగారు గొలుసు దిండు కింద పెట్టి తెల్లవారుజామున లేచి చూసే సరికి చోరీ గురైన సంఘటనపై ఆదివారం గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు వివరాలు ప్రకారం.. మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన కూసి వెంకటలక్ష్మి ఆమె భర్త వీరబాబు ఇంటి బయట పడుకున్నారు. వెంకటలక్ష్మి మెడలో ఉన్న గొలుసు తీసి దిండు కింద పెట్టి నిద్రిస్తున్న సమయంలో ఏదో అలికిడి వచ్చి లేచి చూడగా గొలుసు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఏఎస్‌ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు.

బీసీవై పార్టీ అభ్యర్థి ప్రచారం

ప్రత్తిపాడు, మే 5: బీసీవై పార్టీ కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ అనూషయాదవ్ ఆదివారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లి, ఉత్తరకంచి, లంపకలోవ, రౌతుపాలెం తదితర గ్రామాల్లో ఆమె రైతు గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు. పార్లమెంట్ అభ్యర్థిగా తనను గెలిపిస్తే కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ద్విచక్రవాహనాలు అందజేస్తామని తెలిపారు. దేవర వెంకటరమణ, పార్టీ కార్యదర్శులున్నారు.